గ్రామాల్లో రిజిస్ట్రేషన్ల కోలాహలం


నున్న సచివాలయంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కోసం వేచి ఉన్న లబ్ధిదారులు

విజయవాడ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ గన్నవరం నియోజకవర్గం వ్యాప్తంగా వేగవంతంగా జరుగుతోంది. గ్రామాల్లోని సచివాలయాల కార్యదర్శులకు సబ్ రిజిస్ట్రార్ అధికారాలను ప్రభుత్వం కల్పించడంతో సచివాలయాలు రిజిస్ట్రేషన్ కార్యాలయాలుగా మారాయి. గ్రామ సచివాలయ వీఆర్వో, కార్యదర్శి రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. దీంతో సచివాలయాలు లబ్ధిదారులతో కొత్త వాతావరణాన్ని సంతరించుకున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగింది. విజయవాడ రూరల్ మండలంలో 12287 మందికి ఇళ్ల స్థలాలు పంపిణీ చేసింది. వాటిలో మొదటి విడతగా 10670 మందికి ప్రభుత్వం లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేయిస్తోంది. విజయవాడ రూరల్ మండల పరిధిలో ఇప్పటికే 237 మందికి ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్స్ జరిగాయి. అదేవిధంగా బాపులపాడు మండలంలో 3315 మందికి గానూ 2597 మందికి, గన్నవరం మండలంలో 7758 మందికి గానూ 5079 మందికి రిజిస్ట్రేషన్ చేశారు. అలాగే ఉంగుటూరు మండలంలో 3213 మంది లబ్ధిదారులకు గాను 2250 మందికి రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. 1977 అస్సైన్డ్ భూముల చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. రిజిస్ట్రేషన్ చేసిన తర్వాత కన్వేయన్స్ డీడ్ జారీ చేయడం వలన 10 ఏళ్ల తర్వాత ఆ ఇళ్ల స్థలాలను అమ్ముకునే హక్కును ప్రభుత్వం కల్పించింది. గతంలో పేదలకిచ్చిన ఇళ్లు అమ్ముకోవాలంటే కనీసం 20 ఏళ్లు గడువు ఉండేది. కానీ జగనన్న ప్రభుత్వం 20 ఏళ్ల గడువును 10 సంవత్సరాలకే కుదించింది. ఇలాంటి సదుపాయాన్ని గతంలో ఏ ప్రభుత్వం కల్పించలేదని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు ఎంతో ఉపయోగకరం



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్లు నిర్మించడం జరుగుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా ఇళ్లపట్టాలను రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం సంతోషకరంగా ఉంది. ఇళ్ల పట్టాలను బ్యాంకులో పెట్టుకొని రుణం తీసుకునే సదుపాయం కూడా కల్పించారు. ఇది పేదప్రజలకు ఎంతో ఉపయోగకరం.

– నక్కబోయిన కుమారి, నున్న గ్రామం

ఉచితంగా రిజిస్ట్రేషన్



రాష్ట్ర ప్రభుత్వం ఇళ్ల స్థలాలను ఉచితంగా లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడం జరుగుతోంది. రిజిస్ట్రేషన్ చేసిన నాటి నుంచి 10 సంవత్సరాల తర్వాత ఇంటి స్థలాలను విక్రయించుకునే సదుపాయం కల్పించింది. ఈ విధానం లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనకరం. గ్రామాల్లోని లబ్ధిదారులు మీ గ్రామ సచివాయలంలోనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి.

– పి.జాహ్నవిరెడ్డి, తహసీల్దార్, విజయవాడ రూరల్

క్లుప్తంగా

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



కంకిపాడు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ఉప్పలూరు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సంతోషచంద్రిక అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు. ఆసుపత్రిలో సురక్షిత ప్రసవాలు జరుగుతున్నాయని, వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో ఎంపీడీఓ పీ అనూష, సీనియర్ అసిస్టెంట్ బద్రి, ఎంపీహెచ్‌ఈఓ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలి

గన్నవరం: విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరు సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఎంఈఓ కే రవికుమార్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్త గ్రూపుల నిర్ధారణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా మరొకరికి ప్రాణదానం చేయవచ్చని తెలిపారు. రెడ్‌క్రాస్ జిల్లా కార్యదర్శి బీ శంకర్‌నాథ్ మాట్లాడుతూ రక్తదాన ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు, గ్రూపుల నిర్ధారణ కోసం ఈ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హెచ్‌ఎం డీ ఝాన్సీరాణి, రెడ్‌క్రాస్ గన్నవరం శాఖ చైర్‌పర్సన్ సీ మాధవీ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉంగుటూరు: మండలంలోని తేలప్రోలు, పెద అవుటపల్లి గ్రామాల్లో ప్రతిపాదిత పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సుబ్బారావు సోమవారం పరిశీలించారు. తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ వంటి వసతులను కేంద్రాలలో పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లో చేరిన పెనమలూరు ఎస్సై



పెనమలూరు: పెనమలూరు ఎస్సైగా శేషకుమార్ సోమవారం విధుల్లో చేరారు. గతంలో ఆయన గూడూరు ఎస్సైగా పని చేశారు. పెనమలూరు నుంచి ఫిరోజ్ గుడివాడకు, ఉషారాణి ఉయ్యూరు రూరల్‌కు బదిలీ అవ్వగా వారి స్థానంలో శేషకుమార్ వచ్చారు. సీఐ టీవీవీ రామారావుకు ఎస్‌ఐ శేషకుమార్ రిపోర్టు చేశారు.

ద్వారకా తిరుమల దేవస్థానానికి గార్బేజ్ ట్రక్కు అందజేత

హనుమాన్‌జంక్షన్ రూరల్: నుగలాపు జయలక్ష్మీ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ద్వారకా తిరుమల దేవస్థానానికి గార్బేజ్ ట్రక్కును వితరణ చేశారు. బాపులపాడు మండలం తిప్పనగుంట పీఏసీఎస్ చైర్మన్ మూల్పూరు ప్రభుకాంత్ చేతుల మీదుగా ట్రక్కును సోమవారం ద్వారకా తిరుమల దేవస్థానం అధికారులకు అందజేశారు. నుగలాపు జయలక్ష్మీ జ్ఞాపకార్థం ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి గత 15 ఏళ్లుగా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ప్రభుకాంత్ కొనియాడారు. ట్రస్ట్ చైర్మన్ నుగలాపు వెంకటేశ్వరరావు, కార్యదర్శి నుగలాపు వెంకటసురేష్‌బాబు పాల్గొన్నారు.

కోకోనట్ ఇండస్ట్రీలో అగ్నిప్రమాదం

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడ(ఎలీప్)లో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఎలీప్ కోకోనట్ ఇండస్ట్రీకి చెందిన మిషనరీ, ముడిసరుకు, షెడ్డు దగ్ధమైనట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. అజిత్‌సింగ్‌నగర్ ఫైర్ స్టేషన్ అధికారి ఎస్.రమేష్ వివరాలు తెలియజేస్తూ పారిశ్రామికవాడలోని కొబ్బరి పౌడర్, ఎండు కొబ్బరి తయారు చేసే ఇండస్ట్రీలో అగ్ని ప్రమాదం జరిగినట్లు చెప్పారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం సంభవించినట్లు భావిస్తున్నామన్నారు. తమ సిబ్బందితో పాటు, గన్నవరం అగ్నిమాపక కేంద్రం అధికారి జాన్ అహ్మద్, సిబ్బంది మంటలు ఆర్పేందుకు సహకరించారని తెలిపారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com

ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం


క్రీడాకారులను అభినందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

గన్నవరం: ప్రతిభావంతులైన క్రీడాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఎంపీపీ అనగాని రవి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో తృతీయ స్థానం సాధించిన గన్నవరం నియోజకవర్గ జట్టును ప్రజాప్రతినిధులు, అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవి మాట్లాడుతూ జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో గన్నవరం జట్టుకు ప్రాతినిథ్యం వహించిన బుద్దవరం గ్రామసచివాలయం-2 జట్టు క్రీడాకారులు తృతీయ స్థానంలో నిలిచి రూ. 10 వేల నగదు, షీల్డ్, పతకాలను అందుకున్నారని తెలిపారు. ఎంపీడీఓ సత్యకుమార్, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, ఈఓపీఆర్డీ పి. వెంకటేశ్వరమ్మ, ఎంఈఓ కె.రవికుమార్, కేవీఆర్ స్పోర్ట్స్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్, నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త డి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నూతన పాల సేకరణ కేంద్రం ప్రారంభం


పాల సేకరణ కేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీపీ రవి

గన్నవరం: మండలంలోని అల్లాపురం గ్రామంలో జగనన్న పాల వెల్లువలో భాగంగా నూతనంగా ఏర్పాటు చేసిన పాల సేకరణ కేంద్రాన్ని ఎంపీపీ అనగాని రవి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రవి మాట్లాడుతూ ప్రైవేట్ డెయిరీల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం జగనన్న పాల వెల్లువ తీసుకువచ్చిందన్నారు. ఇతర డెయిరీలతో పోలిస్తే పాడి రైతులకు అధిక ధర చెల్లించడంతో పాటు బోనస్‌లు, రాయితీపై పశుదాణా, గేదెలు, ఆవుల కొనుగోలుకు రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సర్పంచ్ డొక్కు సాంబశివవెంకన్నబాబు, పంచాయతీ కార్యదర్శి సత్యబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగశంకర్, సురేష్, అవుటపల్లి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌లు


పెనమలూరు తహసీల్దార్ ప్రసాద్


కంకిపాడు తహసీల్దార్ రామకృష్ణ


గన్నవరం తహసీల్దార్ సీతపవన్‌కుమార్

పెనమలూరు: పెనమలూరు మండల తహసీల్దార్‌గా పీఎస్‌డీ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన కట్టా వెంకటశివయ్య బదిలీపై పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పశ్చిమగోదావరి జిల్లా తణుకు నుంచి వచ్చిన పీఎస్‌డీ ప్రసాద్ పెనమలూరు తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. మండల రెవెన్యూ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు.

గన్నవరం తహసీల్దార్‌గా..

గన్నవరం: గన్నవరం మండల తహసీల్దార్‌గా ఎన్ సీతపవన్‌కుమార్ సోమవారం బాధ్యతలను స్వీకరించారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం నుంచి బదిలీపై వచ్చిన ఆయన తహసీల్దారు కార్యాలయంలో ఛార్జ్ తీసుకున్నారు. డెప్యూటీ తహసీల్దార్ అరుణ్, ఆర్‌ఐ ఉదయ్, కార్యాలయ అధికారులు, సిబ్బంది తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

కంకిపాడు తహసీల్దార్‌గా రామకృష్ణ

కంకిపాడు: కంకిపాడు తహసీల్దార్‌గా తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం నుంచి బదిలీపై వచ్చిన ఎం.రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయంలో తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా కృషి చేస్తానన్నారు. డెప్యూటీ తహసీల్దార్ నాగరాజు, సిబ్బంది తహసీల్దార్‌కు స్వాగతం పలికారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం స్వాధీనం

కంకిపాడు: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కంకిపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఘటనపై పోలీసుస్టేషన్‌లో ఆదివారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. ఇన్‌ఛార్జి ఎస్‌ఐ అవినాష్ కథనం మేరకు..రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సివిల్ సప్లయిస్ డీటీ భవాని, సిబ్బందితో కలిసి ఈడుపుగల్లు బీసీకాలనీ సెంటర్‌లో తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో వ్యాన్‌లో 35 బస్తాల బియ్యం గుర్తించారు. రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సివిల్ సప్లయిస్ అధికారులకు అప్పగించారు. కంకిపాడు గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ ఓబులశెట్టి సంజయ్‌బాబును అరెస్టు చేసి వ్యాన్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తహసీల్దార్ నరసింహారావుకు ఘనంగా వీడ్కోలు


నరసింహారావు దంపతులను సత్కరిస్తున్న ఉద్యోగులు

గన్నవరం: గత నాలుగేళ్లుగా గన్నవరం తహసీల్దార్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న సీహెచ్ నరసింహారావుకు రెవెన్యూశాఖ అధికారులు, సిబ్బంది సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. స్థానిక ఏబీ కన్వెన్షన్ హాలులో తహసీల్దార్ నరసింహారావు దంపతులను దుశ్శాలువాలు, గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ అరుణ్, పీడీఎస్ డీటీ ప్రధాని, ఆర్‌ఐ ఉదయ్, పలువురు అధికారులు, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు తాడిగడపలో ఉచిత వైద్య శిబిరం

పెనమలూరు: తాడిగడప గ్రామ పరిధి గ్రీన్‌సిటీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు శేషగిరిరావు తెలిపారు. మంగళవారం ఉదయం 9 గంటలకు గ్రీన్‌సిటీ కాలనీలో సిద్ధార్థ వైద్య కళాశాల ఆధ్వర్యాన దంత సంబంధిత సమస్యలకు ఉచితంగా చికిత్స చేసి మందులు పంపిణీ చేస్తామని అన్నారు.

రేపు ఉపాధి హామీ పనులపై ప్రజా వేదిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన పనులపై బుధవారం ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు బాపులపాడు ఏపీఓ అశోక్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో బాపులపాడు మండలంలో నిర్వహించిన పనులపై ఇప్పటికే సామాజిక తనిఖీ పూర్తి చేసినట్లు వివరించారు. ఈ తనిఖీ నివేదికపై బుధవారం ఉదయం 10 గంటలకు ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగే ప్రజా వేదికకు ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులందరూ హాజరు కావాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎంపిక


శ్రీనివాస్, రవీంద్రలకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీమోహన్

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడిగా డీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వేములపల్లి రవీంద్ర నియమితులయ్యారు. సోమవారం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ వీరికి నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని, నాయకులను కలుపుకొని పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. మనందరం కలిసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరల ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్ వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యుడు సువర్ణరాజు, వైఎస్సార్ సీపీ రూరల్ మండలం అధ్యక్షుడు శీలం రంగారావు, మాజీ ఉపసర్పంచ్ చెన్ను కమల్‌రాజు, సొసైటీ బ్యాంకు చైర్మన్ సాదం వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

నేడు పెనమలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష

పెనమలూరు: పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి బిజిలీ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తామని పేర్కొన్నారు. వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. గ్రామ ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

10న మండల పరిషత్ సమావేశం

గన్నవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఇ.సత్యకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అనగాని రవి అధ్యక్షతన సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్ష జరపనున్నట్లు పేర్కొన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఉచితంగా జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్


పెనమలూరులో ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేయించుకున్న మహిళ


ఉప్పలూరు సచివాలయంలో ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

పెనమలూరు: మండల పరిధిలో వణుకూరు, పెనమలూరు గ్రామాల్లో మొత్తం 11 వేలకు పైగా ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం ఉచితంగా చేపట్టింది. ఇళ్ల స్థలాలు కేటాయించిన సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రారంభించారు. పెనమలూరు సచివాలయం పరిధిలో ఉన్న 450 ఇళ్ల స్థలాలకు పెనమలూరులో రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. వణుకూరు సచివాలయం-1, 2 పరిధిలో ఉన్న 11,400 ఇళ్ల స్థలాలకు ఆయా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తారు. రిజిస్ట్రేషన్ ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. 10 సంవత్సరాల తర్వాత స్థలం అమ్ముకునే హక్కు లబ్ధిదారులకు ఉంటుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలి

కంకిపాడు: పేదల ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని తహసీల్దార్ ఎం.రామకృష్ణ ఆదేశించారు. మండలంలోని ఉప్పలూరు సచివాలయంలో నిర్వహిస్తున్న ఇళ్లస్థలాల రిజిస్ట్రేషన్‌ను సోమవారం ఆయన పరిశీలించారు. తహసీల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వం ఇళ్లస్థలాలు మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులు తమ స్థలాలు, ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. తొలుత గ్రామ పరిధిలోని పోలింగ్ బూత్‌లు 200, 201, 202, 203, 204 కేంద్రాలను సందర్శించి వసతులపై సమీక్షించారు. కార్యక్రమంలో రెవిన్యూ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి తోటల పరిశీలన


మామిడి తోటలు పరిశీలిస్తున్న సైంటిస్ట్ కనకమహాలక్ష్మీ, జిల్లా అధికారి జ్యోతి

గన్నవరం రూరల్: మండలంలోని మాదలవారిగూడెం, కొండపావులూరు, సూరంపల్లి గ్రామాల్లో మామిడి తోటలను కృష్ణా జిల్లా ఉద్యానవన అధికారిణి జె.జ్యోతి, నూజివీడు మామిడి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్త బీ కనకమహాలక్ష్మీ సోమవారం పరిశీలించారు. కనకమహాలక్ష్మీ మాట్లాడుతూ పూమొగ్గలను ఉత్తేజపరిచి త్వరగా పూత రావడానికి పొటాషియం నైట్రేట్ 10 గ్రాములు, యూరియా ఐదు గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. తేనె మంచు పురుగు ఆశించినట్లైతే ఇమిడా క్లోప్రిడ్ 0.3 ఎంఎల్ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. తామర పురుగుల ఉధృతిఎక్కువగా ఉంటే వేప నూనె 1500 పీపీఎం 3ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని తెలిపారు. మామిడికాయ 100 గ్రాముల పరిమాణం వచ్చినప్పుడు నాణ్యత దెబ్బతినకుండా మామిడి సంచులు కాయలకు కట్టాలని జిల్లా ఉద్యానవన అధికారి జ్యోతి సూచించారు. మండల ఉద్యానవన అధికారి ఇ.హరిచంద్, హార్టీకల్చర్ అసిస్టెంట్ వి.దీక్ష, మౌనిక, రైతులు పాల్గొన్నారు.

సిబ్బంది సహకారం మరువలేను

- వీడ్కోలు సభలో ఎస్పీ జాషువా
- భుజాలపై ఎత్తుకొని అభిమానం చాటిన సిబ్బంది


ఎస్పీ జాషువాను భుజాలపైకి ఎత్తుకుని ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న జిల్లా పోలీసు సిబ్బంది

కోనేరుసెంటర్(మచిలీపట్నం): జిల్లాలో లా అండ్ ఆర్డర్‌ను సక్రమంగా నడిపేందుకు సిబ్బంది తనకు అందించిన సహకారం మరువలేనిదని ఎస్పీ పి. జాషువా అన్నారు. కృష్ణాజిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎస్పీ జాషువాకు జిల్లా పోలీసు సిబ్బంది సోమవారం ఘనంగా ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఏఆర్ సిబ్బంది పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన పరేడ్‌కు ఎస్పీ దంపతులు హాజరయ్యారు. పరేడ్ కమాండర్ ఆర్‌ఐ కృష్ణంరాజు నుంచి ఎస్పీ దంపతులు గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటుచేసి అందులో ఎస్పీ దంపతులను కూర్చోబెట్టి అధికారులు, సిబ్బంది తాళ్లతో వాహనాన్ని స్వయంగా ప్రధాన ద్వారం వరకు తీసుకువెళ్లి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రధాన ద్వారం వద్ద ఎస్పీని సిబ్బంది తమ భుజాలపైకి ఎత్తుకుని ఆనందంతో నినాదాలు చేశారు. అనంతరం సుమా కన్వెన్షన్ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎస్పీని జిల్లాలోని అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. గజమాలలతో సన్మానించి ఆయనపై పూలవర్షం కురిపించారు.

బాధగానే వెళ్తున్నా..

ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో తాను పనిచేసిన 20 మాసాల్లో సిబ్బంది తనపై చూపిన ప్రేమాభిమానాలు మరువలేనివన్నారు. శాంతిభద్రతలు పరిరక్షణ, నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరు ఎనలేని కృషి చేశారన్నారు. పోలీసుశాఖలో బదిలీలు సర్వసాధారణం అయినప్పటికీ జిల్లాను వీడి వెళ్లాలంటే ఒకింత బాధగానే ఉందన్నారు. అనంతరం పలువురు అధికారులు, అతిథులు ఎస్పీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ప్రసాద్, బందరు ఇన్‌చార్జ్ డీఎస్పీ యు నాగరాజు, అవనిగడ్డ డీఎస్పీ పి. మురళీధర్, గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్, గన్నవరం డీఎస్పీ జయసూర్య, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీసీఎస్ డీఎస్పీ సుభాష్, డీటీసీ రమేష్, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి


రాజస్థానీ నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కంకిపాడు: విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఎన్ఆర్‌ఐ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ ప్రముఖ వైద్యుడు డాక్టర్ కే శివశంకర్‌రావు, స్కూల్ ఎడ్యుకేషన్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుప్రకాష్ అన్నారు. గోసాలలోని హెచ్‌ఎంకే హైస్కూల్ 40వ వార్షికోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పాఠశాల వ్యవస్థాపకుడు కుల్వంత్‌కౌర్ సహానీ చిత్రపటానికి అతిథులు, పాఠశాల కుటుంబం పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శివశంకర్‌రావు, సుప్రకాష్ మాట్లాడుతూ మార్కుల కంటే విలువలు, వ్యక్తిత్వం ఎంతో అవసరమన్నారు. పాఠశాల డైరెక్టర్ ఆర్.వసంత్‌కుమార్ విద్యార్థులు, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుక్‌మిత్ కౌర్, సైకాలజిస్ట్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రత్యూష సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకటన

నా Clients M/s. LIC Housing Finance Ltd., Bhimavaram వారి సంజాయిషీ ప్రకారం తెలియచేయునదేమనగా... షెడ్యూల్ రాతలా ఆస్తిని కృష్ణా జిల్లా, దావాజిగూడెం వాస్తవ్యులు శ్రీ పోడపర్తి వేణుగోపాలరావు గారు, గొంది శ్రీనివాస్ మరియు గొంది శ్రీవరల్ ల నుండి Regd. Sale deed Dt. 04-04-2023 (Doct. No. 3444/2023) ద్వారా క్రయం పొంది సంపూర్ణ హక్కులతో అనుభవిస్తూ నా క్లయింట్ నుండి Construction లోన్ పొందుటకు నిర్ణయించుకున్నారు. అట్టుండగా సదరు ఆస్తికి సంబంధించిన Original Link Documents అనగా i). Regd. sale deed dt. 02-03-2012 (Doct. No. 2041/2012); ii) Regd. sale deed dt. 19-08-2010 (Doct. No. 5572/2010); iii) Regd. Doct. dt. 02-06-2008 (Doct. No. 2748/2008) and iv). Regd. Sale deed dt. 23-05-2002 (Doct. No.1912/2002) [illegible] House site in an extent of 230.0 sq yards or 192.307 sq. metres in RSNo. 456/3, nearest Door No.2-38, Buddhavaram grama panchayat, Davajigudem village, Ganna varam Mandal, Krishna District being **bounded by: East:** Site belonging to Kaza Padma, **South:** Panchayat Bazar, **West:** Panchayat Bazar, **North:** Site belonging to Jilugu Buddiah.

P.Ramakrishna Paramahamsa
Advocate.
30-10-19, Durga Agraharam,
Vijayawada - 2. Cell: 9866335633
Vijayawada Date: 05-02-2024

బ్యాంక్ ఆఫ్ బరోడా / Bank of Baroda
గాంధి నగర్ బ్రాంచ్, విజయవాడ-520003

డిమాండ్ కమ్ పునః స్వాధీనత - జప్తు నోటీసు

దిగువ తెలిపిన ఋణగ్రహీత(లు) అంగీకరించిన నియమాల ప్రకారం ఋణ సదుపాయం యొక్క అసలు వడ్డీని తిరిగి చెల్లించుటలో విఫలమైనారని మరియు పై సదరు ఋణ సదుపాయాలకు సంబంధించి ఖాతాల యొక్క ఆపరేషన్ నిర్వహణ క్రమరాహిత్యంగా ఉందని ఇందుమూలంగా తెలియజేయడమైనది. ఋణగ్రహీత/లు డీఫాల్ట్‌కు పాల్పడినందున, గ్యారంటర్లు వారిచే అమలు చేయబడిన లెటర్ ఆఫ్ గ్యారంటీ ప్రకారం బ్యాంక్‌కు బకాయి మొత్తాన్ని చెల్లించవలసి ఉంది. తదనుగుణంగా, తేది:26-12-2023 తేదీ గల డిమాండ్ నోటీసు/లు దిగువగా తెలిపిన వారి చిరునామాలకు జారీ చేయబడినవి. కానీ సదరు నోటీసులు అందకుండా తిరిగి వచ్చినవి మరియు అందువలన బహిరంగ ప్రకటన ద్వారా వారికి తెలియజేయబడుతుంది.

ఋణగ్రహీతల పేర్లు & చిరునామా	తాకట్టు పెట్టిన చిరాస్తి వివరాలు	బకాయి మొత్తం (నోటీసు తేది నాటికి)
ఋణగ్రహీత : మెస్సర్స్ ఆధ్యా కార్ ట్రావెల్స్, ప్రొప్రయిటర్ : శ్రీమతి కృష్ణవేణి వెలగ్రవు, 3-150, తాడిగడప, పెనమలూరు మండలం, విజయవాడ. కార్ లోన్ - కమర్షియల్ పర్పస్ : లోన్ ఖాతా నెం.41770600000966, బిజిఇసిఎల్ : లోన్ ఖాతా నెం. 41770600001246	TATA MOTORS LTD వెహికల్ మోడల్ : 2019 వెహికల్: రిజిస్ట్రేషన్ నెం. AP16TS8762 నోటీసు తేది: 26.12.2023	రూ.3,54,000/- (అక్షరాల మూడు లక్షల యాభై నాలుగు వేల రూపాయలు మాత్రమే) దానిపై వ్యయాలు, ఛార్జీలతో పాటు అంగీకరించిన రేట్ల వంతున తేది:06-10-2023 నుండి వర్తింపుతో దానిపై తదుపరి వర్తించని వడ్డీ

చెల్లింపు లేదా రాబట్టుకొనే వరకు వ్యయాలు, ఛార్జీలు, ఇతర మరిలతో పాటు అంగీకరించిన రేట్ల వంతున తేది.06.10.2023 నుండి వర్తింపుతో దానిపై తదుపరి వడ్డీతో పైన తెలిపిన మొత్తాన్ని పైన తెలిపిన ఋణగ్రహీత మరియు హామీదారులు బకాయి పడినారు. మరియు మీ అందరిచే అది చెల్లించబడాలి. అందువలన బ్యాంక్ ఆఫ్ బరోడా అయిన మేము ఈ నోటీసు తేదీ నుండి 15 రోజులలోగా పైన తెలిపిన మొత్తాన్ని చెల్లించవలసిందిగా మీ అందరినీ సంయుక్తగా మరియు విడివిడిగా కోరుతున్నాము. [illegible]

తేది: 05-02-2024, ప్రదేశం: విజయవాడ
సం/- బ్రాంచి మేనేజర్, బ్యాంక్ ఆఫ్ బరోడా